# నీగ్రోల భూములను దుర్మార్గంగా కబళించిన అమెరికా దేశ పెట్టుబడిదారీ వ్యవస్థ

**ఒకనాడు** మంచులాంటి తెల్లటి కింగ్ కాటన్ పత్తి తోటలతో నిండివుండే అమెరికా దేశంలోని మిసిసిపి డెల్టా ప్రాంతమంతా యిప్పుడు పచ్చటి సోయాబీన్ తోటలతో నిండి పోయింది. ఇప్పుడు తోటలూ, పంటక్షేత్రాలూ– భారీ పారిశ్రామిక పంట క్షేత్రాలుగా, చాలా ఎక్కువ విస్తీర్ణం గల భూముల్లో నిర్వహింపబడు తున్నాయి. ఇప్పుడు యీ పంటపొలాల్లో జన్యుమార్పిడి పంటలు పండిస్తున్నారు. లేసర్ కిరణాల దర్శకత్వంలో నడిచే ట్రాక్టర్లను వ్యవసాయ పనులలో వాడుతున్నారు. డ్రోన్ ద్వారా పంటలపై క్రిమిసంహారక మందులు జల్లుతున్నారు. అతి తక్కువ క్షేత్రాలకు మాత్రమే రైతులు భూస్వంతదారులుగా మిగిలి వున్నారు. ఈ సంఖ్య కూడా (భూ యజమానులైన రైతుల) రోజురోజుకీ తగ్గిపోతోంది. పెద్దపెద్ద కార్పొరేటు సంస్థలు వేల ఎకరాల సారవంతమైన డెల్టా భూములను కొనుగోలుచేసి మెగా వ్యవసాయ క్షేత్రాలను నిర్వహిస్తున్నాయి. ఒకప్పుడు నల్లజాతి నీగ్రో రైతులు మెజారిటీ సంఖ్యలో యీ ప్రాంతంలోని భూముల్లో పంటలు పండిస్తూ వుండగా, గత 20 సంవత్సరాల నుండీ వ్యాపారస్తులైన పెట్టుబడిదారులు, హెడ్జి – ఫండ్ మేనేజర్లు, అగ్రి బిజినెస్ సలహా నిపుణులు యీ ప్రాంతంలో పెత్తనం చేస్తూ, వ్యవసాయ క్షేత్రాలను నిర్వహిస్తున్నారు.

దక్షిణ అమెరికా రాష్ట్రాలలోని భూమి అంతా మూలవాసులైన రెడ్ యిండియన్ తెగలవారిది. వారిని బలవంతంగా తరిమివేసి వారి భూమిని అక్కడకు వలసవచ్చిన తెల్లవారు స్వాధీనం చేసుకొన్నారు. ఆ భూమినంతా బానిసలుగా తేబడ్డ నీగ్రోల శ్రమతో – అడవులను నరికించి, నీటిని పోయించి, పంట భూములుగా, ఉత్పత్తిదాయకమైన సారం కల వ్యవసాయ భూములుగా మలిచారు.

నీగ్రో బానిసల విముక్తి అనంతరం అంతర్యుద్ధకాలం అనంతరం, ప్రతీ ఒక్కరికి (నీగ్రోలకు) 40 ఎకరాల సాగుక్షేత్రం యిస్తారనే వాగ్దానం వలన, స్వేచ్ఛా నీగ్రోలు తాము కష్టపడి సంపాదించిన మొత్తాలతో కౌలురైతులుగా పనిచేసే యీ ప్రాంతంలో భూములను పొంది స్వంతదారులయ్యారు. అనేక సందర్భాలలో బీడు భూముల్ని సహితం స్వంతపరచుకొని వాటిని తమ శ్రమశక్తిని వెచ్చించి పంట పొలాలుగా మలచుకొన్నారు. తమకంటూ స్వంత యింటి ఆవరణాలను ఏర్పరచుకొన్నారు. అమెరికా వ్యవసాయశాఖ వారి లెక్క ప్రకారం, 1910 సంవత్సరం నాటికి, మిసిసిపీ ప్రాంతంలో నల్లజాతివారైన నీగ్రోల చేతిలో 22 లక్షల ఎకరాల భూమి వుంది. 25,000 మంది నల్లజాతి (నీగ్రో) రైతులు యీ భూముల్లో సేద్యం చేసుకొంటున్నారు.

అయితే, క్రమక్రమంగా, వివిధ అమెరికన్ పెట్టుబడిదారీ ప్రభుత్వ విధానాల వలన చరిత్రకారుడు పీటెడానియల్ ప్రకారం 1950 సంవత్సరం అనంతర 25 సంవత్సరాల కాలంలో నీగ్రోలు స్వంతదారులైన 5 లక్షల ఎకరాల వ్యవసాయ క్షేత్రాలు వారి చేతినుండి బయటకు వెళ్ళిపోయాయి. "ఎమర్జెన్సీ ఫండ్" అనే గ్రూపు (నీగ్రోల భూబేదఖల్ సమస్యలపై పోరాడటానికి ఏర్పడిన ఒక సంస్థ) యొక్క అధ్యక్షుని అంచనా ప్రకారం 1950 నుండి 1969 మధ్యకాలంలో నల్లజాతి (నీగ్రో) రైతుల నుండి 60 లక్షల ఎకరాల భూమి బేదఖల్ చేయబడింది. ఒక్క 1960 సంవత్సరంలోనే నల్లరైతుల స్వంతమైన 87,000 ప్రత్తి క్షేత్రాలు కేవలం 3000కు తగ్గిపోయాయి. వ్యవసాయశాఖ గణాంకాల ప్రకారం 1950 నుండి 1964 మధ్యకాలంలో, మిసిసిపీ ప్రాంతపు నల్ల (నీగ్రో) రైతులు సుమారు 8,00,000 ఎకరాలను కోల్పోయారు.

ఫెడరల్ (అమెరికన్) పెట్టుబడిదారీ ప్రభుత్వం అవలంబించి, కొనసాగించిన విధానాలే యీ దారుణ 'భూ దోపిడీ'ని సృష్టించాయి. దేశమంతటా కలిపి మొత్తంగా ఒక లక్ష నీగ్రో రైతు కుటుంబాల నుండి వారి పంటపొలాలు లాగేసుకున్నారు. క్రమక్రమంగా నీగ్రో రైతులు తమ పంటపొలాల నుండి తొలగింపబడటంతో చికాగో, డెట్రాయిట్ తదితర నగరాలకు పోయి అక్కడి పరిశ్రమల్లో కూలీలుగా (శ్రామికులుగా) చేరిపోయారు.

1937లో దేశాధ్యక్షుడు ఫ్రాంక్లిన్.డి. రూజ్‌వెల్టు చేబట్టిన నూతన వ్యవసాయిక విధానం అన్నది, 'వ్యవసాయ క్షేత్రాల భద్రతా నిర్వహణ' అనే ఏజెన్సీ ఏర్పాటుకు దారితీసింది. ఈ సంస్థ (ఎఫ్.ఎస్.ఎ) దేశంలోని చిన్న రైతులకు సహాయం అందించటం కోసం ఏర్పాటు చేశారు. ఇతర "నూతన విధానాలు" అమలులో జరిగినట్లుగానే, యీ ఏజెన్సీ నిర్వహణలో కూడా, తెల్లజాతివారైన అధికారులు నల్లజాతి నీగ్రో రైతులను పట్టించు కోకపోవటమే కాక, వారినే లక్ష్యం చేసుకొని పని చేశారు. వారికి ఈ సంస్థ రుణాలు యివ్వటానికి నిరాకరించింది. అదేరకంగా పొలాలను నీగ్రో రైతులకు కౌలుకు యివ్వకుండా, తెల్లజాతి రైతులకే యిచ్చింది. 1945లో యీ సంస్థ రైతుల అంతర్గత వ్యవహారాల నిర్ణయశాఖ (ఎఫ్.హెచ్.ఎ)గా రూపాంతరం చెందింది. చిన్న రైతులకు సహాయపడే కార్యక్రమాలు నిర్వహించాల్సిన యీ సంస్థ, అమెరికన్ వ్యవసాయశాఖ నేడు అమలుజరుపుతున్న "అప్పులు – సబ్సిడీ" విధానాలను చేపట్టేందుకు అవసరమైన సంస్థాగత మార్పులను నాడే అమలుజరిపింది. 1965లో దేశాధ్యక్షుడు జె.ఎఫ్.కెన్నడీ

ప్రభుత్వం వ్యవసాయ స్థిరీకరణ – పరిరక్షణ సేవల సంస్థ (ఎ.ఎస్.సి.ఎస్) అనే రైతులకు అప్పులు యిచ్చే ఎఫ్.హెచ్.ఎస్.కు సహాయకారిగా వుండే మరొక సంస్థను స్థాపించింది. ఇది వ్యవసాయశాఖలో అంతర్భాగంగా వుండే ఫెడరల్ సంస్థ. కానీ యీ సంస్థలో అప్పులు మంజూరుచేసే, రైతులకు అప్పులు యిచ్చే కీలకమైన కమిటీలలోని సభ్యులను స్థానికంగా ఎన్నుకొనేవారు. ఆ ఎన్నికలలో నల్లజాతి నీగ్రోలకు ఓటుహక్కు నిషేధింపబడింది. అంటే తెల్లజాతి వారు మాత్రమే కమిటీ మెంబర్లుగా ఎన్నికవుతారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా అమెరికా దేశపు వ్యవసాయశాఖ మిసిసిపీ డెల్టా ప్రాంతాల్లాంటి ప్రాంతాల్లో వ్యవసాయ ఆర్థిక వ్యవస్థకు భద్రతా జాలంగా వ్యవసాయ ధరలను నిర్ణయించే, వ్యవసాయంలో ప్రధాన పెట్టుబడిదారుడిగా వుండే, వ్యవసాయ ఆర్థిక వ్యవస్థను నియంత్రించే ఏకైక సంస్థగా రూపొందించబడింది. ఈ రకంగా ఒక "వ్యవసాయ ప్రభుత్వం" ఏర్పాటు చేయబడింది.

ఇలా ఏర్పాటు చేయబడ్డ "వ్యవసాయ ప్రభుత్వం" వలన పెద్దపెద్ద వ్యవసాయ పంటల కర్మాగారాలు పుట్టుకు వచ్చాయి. చిన్న చిన్న వ్యవసాయ క్షేత్రాలు కుప్పకూలిపోయాయి. ఈ "వ్యవసాయ ప్రభుత్వ" నాయకులు తెల్లజాతివారే కావటంతో నల్లజాతి నీగ్రోలను తమవైన స్వంత వ్యవసాయ క్షేత్రాల నుండి వెళ్ళగొట్టారు.

ఈ సంస్థ యిచ్చే రుణాల పథకాల ద్వారా చట్టవిరుద్ధమైన ఒత్తిళ్ళు పెంచి, నీగ్రో రైతుల సంపదను తెల్లజాతి సంపన్నులు దోచుకున్నారు. ఫెడరల్ ప్రభుత్వం రైతులకు పెట్టిన పెట్టుబడుల్లో నల్లజాతి వ్యతిరేక వైఖరులు (దక్షిణాది రాష్ట్రాలలో) వెల్లడయ్యాయి. ఎఫ్.ఎం.హెచ్.ఎ. సంస్థ చిన్న, మధ్యతరగతి తెల్లజాతి రైతులకైతే భారీఎత్తు మొత్తాల్లో రుణాలు యిచ్చింది. కానీ అదే స్థాయి నీగ్రో రైతులకు మాత్రం తక్కువ మొత్తాల్లో రుణాలు యిచ్చే జాతి వివక్షతా విధానాలు–నీగ్రోజాతి రైతులను పేదరికంలోకి నెట్టడానికి, వారిని భూముల నుండి తొలగించ టానికి కారణమయ్యాయి.

ఆ వ్యవసాయక సంస్థల్లో నీగ్రో రైతులకు కూడా ఓటుహక్కు యివ్వాలని ఆందోళనలు చేపట్టిన వారికి, ఆందోళనలో పాల్గొన్న వారికి (నీగ్రో రైతులకు) ఆ సంస్థలు కానీ, బ్యాంకులు కానీ రుణాలను మంజూరు చెయ్యటంలో అనేక చిక్కులు కల్పించాయి. 2001లో అసోసియేటెడ్ ప్రెస్ చేపట్టిన ఒక పరిశోధనలో "1950 నుండి 1960 మధ్య కాలంలో హోమ్స్ కౌంటీ (జిల్లా)లో ట్రక్కులు, భారీ వ్యవసాయ పరికరాలు అమ్మే నార్మన్ విథర్‌బే అనే వ్యక్తి, స్థానిక ఎఫ్.ఎం.హెచ్.ఎ (రుణాలు యిచ్చే సంస్థ) యొక్క ఏజెంటు అయిన విలియం స్ట్రైడర్‌తో కుమ్మక్కయి వారికి రుణాలు చాలా ఆలస్యంగా అందేటట్లు చేయించి, అందువలన తాము అప్పుపై కొనుగోలుచేసిన వ్యవసాయ పరికరాలకు నీగ్రో రైతులు వాయిదాలు చెల్లించలేని స్థితికి తీసుకు వచ్చి, ఆ అప్పుల క్రింద నీగ్రో రైతుల భూములను జప్తు చేసుకొన్న 100 కేసుల వివరాలు" బయల్పడ్డాయి.

చట్టవిరుద్ధమైన ఒత్తిడులు, రాష్ట్రాల పథకాలలో తీవ్రమైన జాతి వివక్ష, స్పెక్యులేటర్ల, న్యాయవాదుల మోసాలు, ప్రవేటు అప్పులు యివ్వనిరాకరణ, లేదా ప్రత్యక్షమైన హింస, వేధింపుల ద్వారా చట్ట వ్యవస్థలు నీగ్రోరైతుల భూములను పన్నుల చెల్లింపు కోసం అమ్ముకొనేటట్లు, భూ విభజన అమ్మకాలు చేసేటట్లు, లేదా అప్పులు చెల్లించలేక తాము తనఖా పెట్టిన భూములను కోల్పోయేటట్లు చేశాయి. నల్లజాతి నీగ్రో రైతులకు న్యాయసేవలు అందుబాటులో లేకపోవటం, సంక్లిష్టమయిన వారసత్వ హక్కుల వలన నీగ్రో రైతుల కుటుంబాల వారు తమ వారసత్వపు హక్కులను పొందలేక భూములను కోల్పోయారు. మూక దాడులు, పోలీసుల అమానుషత్వం, యితర రూపాల్లో వేధింపుల కారణంగా కూడా అనేక మంది రైతులు తమ భూములను వదులుకొని పారిపోక తప్పలేదు. ఎ.ఎస్.సి.ఎస్. ఎన్నికలలో చురుకుగా వ్యవహరించిన నీగ్రోల యిన్సూరెన్స్‌లు రద్దుచేశారు. ఒక్క పత్తిపంటపై తప్ప యితర పంటలపై నీగ్రో రైతులకు రుణాలు నిరాకరించారు. భూ స్వంతదారులలో, సహ స్వంతదారులుగా వున్న నీగ్రో రైతుల భార్యలకు బ్యాలట్ పత్రాలు (రుణసంస్థల కమిటీ సభ్యుల ఎన్నికలకు) పంపకుండా నిలువరించారు. ఈ రకంగా 1965లో ఓటింగ్ హక్కుల చట్టం చేసినా, నీగ్రో రైతులను ఓటు వేయకుండా నిరోధించారు. తీరా మిసిసిపీ ప్రాంతంలో నీగ్రో రైతులు ఓటుహక్కును పొందేనాటికి వారి సంఖ్య మైనార్టీస్థాయికి కుదించుకుపోయింది. తెల్లజాతి రైతుల సంఖ్య మెజార్టీ స్థాయికి చేరుకొంది. ఆరకంగా నీగ్రో రైతులు తమ స్వంత భూములపై హక్కులు కోల్పోయి, భూమిని 'పోగొట్టు' కొన్నారు.

వివిధ పద్ధతుల ద్వారా, కొన్నిసార్లు చట్ట బద్ధంగా, తరచుగా బలవంతంగా, అప్పుడప్పుడు హింస ద్వారా, నల్లజాతి నీగ్రో రైతుల చేతుల్లో వున్న భూమి తెల్లజాతి సంపన్నుల స్వంత మయింది. తర్వాత ఆ భూమి పెద్దపెద్ద వ్యవసాయ క్షేత్రాలుగా పరిణామం పొంది; అంతిమంగా వాల్‌స్ట్రీట్‌కు చెందిన బడా ఇన్వెస్టుమెంటు కార్పొరేషన్ల బడా పారిశ్రామిక వ్యవసాయ క్షేత్రాలుగా రూపొందింది.

రెండు, మూడు తరాలకు పూర్వం యీ డెల్టా ప్రాంతంలో నివసిస్తూ, తమ పొలాల్లో పనిచేసుకొంటూ జీవిస్తున్న నీగ్రోలను ఆ భూములనుండి తొలగించారు. ఆ స్థానంలో మెగా వ్యవసాయ క్షేత్రాలను నిర్వహిస్తున్న బడా కంపెనీలు వచ్చాయి. ఒక్క మిసిసిపీ ప్రాంతం లోనే ఉపాధ్యాయుల పెన్షన్ ఫండ్లను నిర్వహించే సంస్థ అయిన టి.ఐ.ఎ.ఎ. తన అనుబంధ సంస్థలతో కలిపి 80,000 ఎ కరాలకు స్వంతదారయింది. ఆర్కన్సాస్‌లో యీ సంస్థ మిసిసిపీ నది ఒడ్డున 50,000 ఎకరాల భూ ఖండానికి స్వంతదారయింది. డెల్టా రాష్ట్రాలలో టి.ఐ.ఎ.ఎ.తోపాటు మరికొన్ని బడా కార్పొరేటు సంస్థలు కూడా భూస్వాములుగా వున్నాయి. హాన్‌కాక్ వ్యవసాయ పెట్టుబడి గ్రూపుకు యిక్కడ 65,000 ఎకరాలున్నాయి. ఫార్మ్‌లేండ్స్ పార్టనర్స్ అనే రియల్‌ఎస్టేట్ ట్రస్టుకు

30,000 ఎకరాలున్నాయి. అగ్రివెస్ట్ అనే స్విస్ బ్యాంక్ యొక్క అనుబంధ కార్పొరేషన్‌కు 22,000 ఎకరాలున్నాయి.

భారీఎత్తు పెట్టుబడులను కలిగివున్న సంస్థలు చిన్నచిన్న సంస్థలను, స్థానిక రైతులను మించి భూ కొనుగోళ్ళు జరపగలిగిన ఆర్థిక స్థోమతతో వుండటం వలన, అవి విస్తీర్ణమైన భూఖండాలను కొనుగోలు చేయగలిగిన శక్తినేకాక, ఆ మెగా క్షేత్రాలను తరతరాలబాటు తమ స్వాధీనంలో వుంచుకోగలిగిన శక్తిని కలిగి వున్నాయి. అమెరికన్ పెట్టుబడిదారీవిధానం, యిటువంటి బడా భూఖండాలను, మెగా వ్యవసాయ క్షేత్రాలను అతిపెద్ద కార్పొరేషన్లు వశం చేసుకొని, స్వంతదారులుగా వుండేందుకు అనువైన విధానాలను అమలుజరపటంవల్లనే, ఆ దేశంలోని నల్లజాతి నీగ్రో రైతాంగం తమ స్వంతమైన భూముల నుండి చట్టబద్ధంగానే వెళ్ళగొట్టబడ్డారని అర్థమవుతోంది.

భూమి, మానవజాతి మనుగడకు మాత్రమే కాక, సంపదను సృష్టించి, పెంపొందింపజేసే మవులికమైన, ప్రధానమైన వనరుగా వుంది. వివిధ సామాజిక వ్యవస్థలో యిది పాలకవర్గాల అధీనంలోనే వుంటూ, పాలితవర్గాల ప్రజల శ్రమశక్తి ద్వారా అదనపు సంపద సృష్టింపబడి ఆయా దోపిడీ పాలకవర్గాల వశంలోనే వుంటోంది.

ఈ భూ వనరు నుండి పెంపొందింపబడే – సృష్టించబడే సంపద ప్రజలందరికీ పంచబడా లంటే, ఈ సంపదను తమ శ్రమశక్తి ద్వారా పెంపొందించి, సృష్టించే శ్రామికవర్గాల, ప్రజల అధికారంలోని పాలనా వ్యవస్థ ఏర్పడటం తప్పనిసరి అనే విషయాన్ని అమెరికా దేశపు నీగ్రో రైతులు తమ స్వంత భూములను కోల్పోయిన అనుభవం స్పష్టం చేస్తోంది. అటువంటి పాలనా వ్యవస్థే నిజమయిన ప్రజాస్వామ్య పాలన అవుతుంది లేకుంటే ప్రస్తుతం అమెరికా దేశంలో సాగే బూటకపు ప్రజాస్వామ్య పాలనగానే మిగిలిపోతుంది!

('ది అట్లాంటిక్ డైలీ' పత్రికలో వాన్ ఆర్ న్యాకిర్క్ 11 వ్రాసిన వ్యాసం ఆధారంగా)

ooo